క్లుప్తంగా

పీజీ సెట్‌లో ర్యాంకర్లకు అభినందన



ర్యాంకర్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఇటీవల విడుదల చేసిన ఏపీ పీజీ సెట్ పరీక్షల ఫలితాల్లో స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు తెలిపారు. ఎంఎస్సీ జువాలజీలో రాష్ట్ర స్థాయిలో కె.నవీన్ కుమార్ 16వ ర్యాంక్, సీహెచ్ జగదీష్ 245, షేక్ షారూన్ 354 సాధించారని పేర్కొన్నారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో పి.చంద్రశేఖర్ 214, కె.మనోజ్ శ్యామ్ సాయి 249, జి.హేమ వెంకట సత్యనారాయణ 256 ర్యాంక్‌లు సాధించారని వివరించారు. వీరిని, వీరికి తర్ఫీదు ఇచ్చిన అధ్యాపకులు ఎం విజయ్ కుమార్, టీవీఎస్ దుర్గా ప్రసాద్‌లను అభినందించామని తెలిపారు. త్వరలో నిర్వహించే డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లలో ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కోరారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలే కీలకం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): చిన్న, మధ్య తరహా పరిశ్రమలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తున్నాయని సెయింట్ థెరిస్సా మహిళా స్వయంప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ చిన్న, మధ్యతరగతి పరిశ్రమల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చిన్న మధ్య తరగతి పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఉద్యోగాల కల్పన, ప్రాంతీయ అభివృద్ధి, నూతన ఆవిష్కరణకు ఇది ప్రధాన ఆధారంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి పి.విజయలక్ష్మి, అధ్యాపకులు హెప్సిబాను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీల రాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ సుశీల, తదితరులు అభినందించారు.

విద్యార్థిని చదువుకు చేయూత

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు రూరల్ మండలం రామానగర్‌కు చెందిన తియ్యాల వెంకటలక్ష్మి కుమార్తె హేమలత ఇంటర్మీడియట్ విద్య కోసం శ్రీ సాయి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ తన సేవ కార్యక్రమాల్లో భాగంగా డీఈఓ ఎం వెంకటలక్ష్మమ్మ చేతుల మీదుగా రూ.10 వేలు సాయం శనివారం అందచేశారు. హేమలత రామానగర్ స్కూల్‌లో 2024 - 25 విద్యా సంత్సరంలో 10వ తరగతి పూర్తిచేసింది. హేమలతకు తండ్రి లేరు.

మహిళా పోలీస్ స్టేషన్ భవనం ముస్తాబు

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద పార్కు నిర్మాణం



పోలీస్ కార్యాలయ సమీపంలో ముస్తాబైన మహిళా పోలీస్ స్టేషన్ భవనం



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద క్రాస్‌రోడ్స్ పేరుతో నిర్మించిన పార్కు





ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద ఆహ్లాదకరంగా ఉన్న నూతన పార్కు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం పనులు తుది దశకు వచ్చాయి. మరోవైపు పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నిర్మాణం పూర్తయింది. ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే ఆహ్లాదకరంగా పార్కును ముస్తాబు చేశారు. ఇవన్నీ ఒకేసారి పోలీస్ బాస్‌తో ప్రారంభించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయ సమీపంలో గత వైఎస్సార్ సీపీ హయాంలో జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం ప్రారంభించారు. సుమారు రూ.1 కోటి పైగా నిధులతో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో, ఫిర్యాదుదారులకు మెరుగైన వసతులతో ఈ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఏలూరు కోటదిబ్బ తహసీల్దార్ కార్యాలయం పక్కన మహిళా పోలీస్ స్టేషన్ ఉంది.

ఆహ్లాదకరంగా పార్కు

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమీపంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే ఆహ్లాదకరంగా పార్కును అభివృద్ధి చేశారు. క్రాస్ రోడ్స్ పేరుతో పిల్లలకు ఆట వస్తువులు, ఎస్పీ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులు సేదతీరేందుకు అనువుగా చెట్లతో, మొక్కలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ పార్కును సుమారుగా రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. పార్కు మధ్యలోనే చెట్లు ఉండడం, రకరకాల మొక్కలు నాటటంతో ఆహ్లాదకరంగా మారింది.

పోలీస్ పెట్రోల్ బంక్

ఏలూరు జిల్లా పోలీస్ సంక్షేమ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అమీనాపేట పోలీస్ కల్యాణ మండపం పక్కనే పోలీస్ పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారు. ఇప్పటికే శాంతినగర్ సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా పోలీస్ పెట్రోల్ బంకు ఉండగా, మరో బంకును ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటికే సబ్సిడీ క్యాంటీన్, పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఏసీ కల్యాణ మండపం, జిమ్, గ్యాస్ సిలిండర్ ఏజెన్సీలు సైతం పనిచేస్తున్నాయి. జిల్లాలోని పోలీస్ శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది సంక్షేమానికి ఇవన్నీ ఏర్పాటు చేశారు.

పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహం



కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): జిల్లాలో వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ, 2024 ద్వారా బయో ఇంధన ప్లాంట్ల ఏర్పాటు చేసే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమా వేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల స్థాపనకు 173 మంది పారిశ్రామిక వేత్తలకు సంబంధించి 112 దరఖాస్తులకు సింగల్ విండో ద్వారా అనుమతులు ఇచ్చామన్నారు. మరో 61 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. 14 పరిశ్రమల యూనిట్లకు వడ్డీ, విద్యుత్, సేల్స్ టాక్స్ రాయితీల కింద రూ.3,44,96,000 ఇచ్చామన్నారు. ఉపాధి హామీ పథకం, పీఎం విశ్వకర్మ అమలుపై సమీక్షించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ జోనల్ మేనేజర్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్ వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు(మెట్రో): స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల గోడౌన్‌ను శనివారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన భద్రతా సీళ్లు, సీసీ కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు మొదలైన వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆమె పరిశీలించారు. రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు యు.బాలానందం (టీడీపీ), ఎ.రతన్ కాంత్ (బీఎస్పీ), నెరుసు నెలరాజు (బీజేపీ), పి.ఆదిశేషు (సీపీఎం), ఎస్ బాబుప్రసాద్, (ఐఎన్‌సీ), వి.స్టాన్లీబాబు (వైఎస్సార్ సీపీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.

పీజీ విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ప్రతి సంవత్సరం సీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ఏలూరు జిల్లాలో ఉన్న కళాశాలల్లో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నామని, సేకరించిన రక్త యూనిట్లను తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా, డయాలసిస్ బాధితులు, గర్భిణులు తదితరులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, పీఆర్‌ఓ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఛిద్రం.. జర భద్రం

- వర్షాలకు పాడైన ఏజెన్సీ రోడ్లు
- అవస్థలు పడుతున్న కొండరెడ్డి గిరిజనులు
- కనీస మరమ్మతులు చేపట్టాలని విన్నపాలు



అధ్వానంగా ఉన్న బుట్టాయగూడెం మండలం రేగులపాడు రోడ్డు



ఛిద్రమైన గొట్టాలరేవు రోడ్డు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన ప్రాంతంలో రహదారులు అధ్వానంగా మారాయి. గత ఏడాది కురిసిన వర్షాలకు రోడ్లు తీవ్రంగా పాడైపోగా వాటికి కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో కొండరెడ్డి గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. కొంతమేర గిరిజనులు శ్రమదానం చేసి రోడ్లను బాగు చేసుకున్నప్పటికీ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అవి దెబ్బతింటున్నాయి. బుట్టాయగూడెం మండలంలోని మారుమూల గ్రామాలైన రేపల్లి, రేగులపాడు, డోలుగండి గ్రామాలతోపాటు మోదేలు గ్రామం వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతిన్నాయి. అదేవిధంగా దొరమామిడి నుంచి వీరమద్దిగూడెం వెళ్లే రహదారి కూడా పాడైపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వాతావరణలో చోటు చేసుకున్న మార్పులతో గిరిజన గ్రామాల్లో అత్యధికంగా టైఫాయిడ్, మలేరియా, కామెర్లు, డెంగీ వంటి జ్వరాల బారిన పడి గిరిజనులు అవస్థలు పడుతున్నారు. అనారోగ్యం పాలైన వారిని దొరమామిడి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం ఆస్పత్రులకు తరలించాలన్నా సరైన మార్గం లేక అనేక అవస్థలు పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే దొరమామిడి డ్యామ్ కాలనీ నుంచి అలివేరు వరకూ కూడా రహదారి పూర్తిగా పాడైపోవడంతో గిరిజనుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

మారుమూల గ్రామాల్లో పూర్తిగా దెబ్బతిన్న రోడ్లు

ఏజెన్సీ ప్రాంతంలో మారుమూల గిరిజన గ్రామాల్లో దాదాపు అన్ని రోడ్లు పూర్తిగా పాడైపోయాయి. పులిరామన్నగూడెం నుంచి గోగుమిల్లి వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడంతో కన్నారప్పాడు, ఉప్పరిల్ల, ముంజులూరు, చింతపల్లి, గోగుమిల్లి, గడ్డపల్లి, గిన్నేపల్లి, దారావాడ, తదితర రహదారులపై ప్రయాణించే గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా పడడంతో ఆయా గ్రామాలకు వెళ్లే గిరిజనుల బాధలు కూడా వర్ణనాతీతంగా మారాయి. ఐటీడీఏ అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

రహదారి కష్టాలు తీర్చాలి



ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలి. కనీసం మరమ్మతులైనా చేపట్టి గిరిజనులకు రహదారి కష్టాలు తీర్చాలి. గత ఏడాది దెబ్బతిన్న రహదారులు కనీస మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ఈ ఏడాది రహదారులు పూర్తిగా పాడైపోయాయి. ప్రతి ఏటా ఇదే పరిస్థితి. అధికారులు మరమ్మతుల పనులు చేపట్టాలి.

– సరియం రామ్మోహన్‌రావు, ఏఐకేఎమ్‌ఎస్ నాయకులు, బుట్టాయగూడెం

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	34	బిళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	36
బెండకాయలు	38	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	40-50	బీట్‌రూట్	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్	96
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	34	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	09
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	13
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	04
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	06
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	11
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	00
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	12
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	16
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

బాధితులకు సత్వర న్యాయం

అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు



ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో మహిళలు, బాలికలు, యువతులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, బాధితులకు సత్వర న్యాయం అందించేలా పోలీస్ సిబ్బంది కృషి చేయాలని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు అన్నారు. ఏలూరు ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులు, సిబ్బందితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు, పోలవరం పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలు, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూర్యచంద్రరావు మాట్లాడుతూ నేరాలకు పాల్పడిన వ్యక్తులకు శిక్షలు పడాలంటే జిల్లాలోని పోలీస్ స్టేషన్స్‌లో అధికారులు, కోర్టు కానిస్టేబుల్స్ పాత్ర కీలకమన్నారు. మహిళలు, బాలికలపై నేరాలకు సంబంధించి బాధితులకు సత్వర న్యాయం అందించేలా పనిచేయాలని సూచించారు. కేసుల్లో సాక్షులను సకాలంలో కోర్టుల ముందు హాజరుపరచటం, చార్జిషీట్ దాఖలు, దర్యాప్తులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నేరాలకు పాల్పడేందుకు భయపడేలా కఠిన శిక్షలు విధించేందుకు న్యాయస్థానాలకు సరైన సాక్ష్యాధారాలు సమర్పించాలని, సాక్షులను ప్రవేశపెట్టటం వంటివి కీలకంగా మారతాయని వివరించారు. ఏదైనా కేసులో నిందితుడు శిక్ష నుంచి తప్పించుకుంటే సమాజానికి చేటు తెస్తుందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతిభ చూపిన కోర్టు కానిస్టేబుల్స్‌కు నగదు, ప్రశంసా పత్రాలతో సత్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మహిళా స్టేషన్, కోర్టు మానటరింగ్ ఇన్‌చార్జి సీఐ ఎం సుబ్బారావు, డీసీఆర్‌బీ ఎస్సై రాజారెడ్డి, జిల్లా కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బంది ఉన్నారు.

షోకాజ్ ఇచ్చినా తీరు మారలేదా ?

కామవరపుకోట పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణపై డీపీఓ ఆగ్రహం



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

కామవరపుకోట: కామవరపుకోట పంచాయతీలో పారిశద్ధ్య నిర్వహణపై డీపీఓ అనురాధ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీలోని ఆయా గ్రామాల్లో పారివృద్ధ్య నిర్వహణ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణను శనివారం ఆమె పరిశీలించారు. కొత్తూరులో తడి పొడి చెత్తపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం ఎంపీడీవో, పంచాయతీ కార్యాలయాలను తనిఖీ చేశారు. కె.కోట పంచాయతీ పారిశద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉండడంపై కార్యదర్శిపై అసహనం వ్యక్తం చేశారు. గతంలో షోకాజ్ ఇచ్చినా తీరు మారలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మరోసారి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇంకా మారకపోతే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ఐవీఆర్‌ఎస్‌లో సచివాలయం 1, 2 లో పారిశుధ్యం బాగోలేదని ప్రజల నుంచి స్పందన సచివాలయ 2 పరిధిలో కేవలం 33శాతం సంతృప్తి నిచ్చిందని, సచివాలయం 3లో అసంతృప్తిగా ఉందన్నారు. స్థానిక జూనియర్ కాలేజీ దగ్గర ఉన్న డంపింగ్ యార్డుతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం, తీవ్రమైన కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందిగా ఉందని గతంలో వేరే చోటకు మార్చమని చాలా సార్లు చెప్పాననీ అన్నారు. తడి, పొడి చెత్త వేరే చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. దీనిపై జూలై 1 నుంచి జరిగే గ్రామసభలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పంచాయతీలో 21 మంది పారిశుధ్య సిబ్బంది ఉన్నా రిక్షాలు ఎందుకు కొనరని ప్రశ్నించారు.

నిర్దేశించిన సమయంలోపే రేషన్ పంపిణీ పూర్తి



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

పెదవేగి : రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీని నిర్దేశించిన సమయంలోపు నూరుశాతం పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మండలంలోని కొప్పాక గ్రామంలోని రేషన్ షాపును శనివారం సాయంత్రం జేసీ ధాత్రి రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపులో జూలై నెలకు పంపిణీ నిమిత్తం తరలించిన సరుకుల నిల్వలను రిజిస్టర్ ప్రకారం ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకుల పంపిణీ విధానం గురించి ఆరా తీశారు. జూలై నెలలో మొదటి 5 రోజులలోనే 80 శాతానికి పైగా సరుకులను పంపిణీ చేయాలన్నారు. జేసీ వెంట ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్ భ్రమరాంబ తదితరులు ఉన్నారు.

రేపు ఏలూరు కార్పొరేషన్ సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు కమిషనర్ ఎ.భాను ప్రతాప్ తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశంలో చర్చించేందుకు అజెండాలో ఏడు అంశాలను రూపొందించామని, ఈ కాపీలను ముందస్తుగా కౌన్సిల్ సభ్యులకు పంపించామని పేర్కొన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచకుంటే పాఠశాలల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని భీమడోలు ఎంఈఓ-2 అయినపర్తి భాస్కరకుమార్ అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేవారు. విద్యార్థుల హాజరు, వారి అభ్యసనా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం కె.రఘురామరాజు, టీచర్ మండే సుధాకర్‌లకు పలు సూచలనందించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలుత డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా తయారుచేసి ఆహార పదార్థాలను ఆయన రుచిచూసి, నిర్వాహకులకు పలుసూచనలు చేశారు.

దెందులూరులో..

దెందులూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఎక్కువ జరిగేలా సంబంధిత గ్రామాల పరిధిలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కృషి చేయాలని దెందులూరు మండల విద్యాశాఖ అధికారి ఆకెళ్ల వెంకట నాగ వరప్రసాద్ అన్నారు. దెందులూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని చల్లచింతలపూడి, పోతునూరు, కొవ్వలి పలు గ్రామాల ప్రధానోపాధ్యాయులతో విద్యార్థుల నమోదు పెంచడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించుకోవాలని ఆధార్ లేకపోయినా బడి పిల్లలను బయట ఉంచకుండా పాఠశాలలో చేరిప్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శర్మ, గోపన్నపాలెం ఉపాధ్యాయుడు సత్యనారాయణ, పోతునూరు హైస్కూల్ హెచ్‌ఎం జయశంకర్, దెందులూరు బాలికొన్నతో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కొఠారును కలిసిన సర్పంచ్



మాజీ ఎమ్మెల్యేను కలిసిన పార్టీ నాయకులు

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని శనివారం ఆయన కార్యాలయంలో పాలకూడు గ్రామ సర్పంచ్ పి.సునీత మర్యాదపూర్వకంగా కలిశారు. పాలగూడెం గ్రామంలో సమస్యలను వివరించారు. సర్పంచ్ వెంట ఉప సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.